



● రిటర్నింగ్ అధికారిణికి నామినేషన్ అందజేస్తున్న అనగాని సత్యప్రసాద్

రేపల్లెలో..జనకెరటం



● రేపల్లెలో నామినేషన్‌కు భారీగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు



అనగానికి బ్రహ్మరథం

● రహదారులన్నీ పసుపుమయం
● వేలాదిగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

రేపల్లె, ఏప్రిల్ 24: జనకెరటం ఉప్పొంగింది, రహదారులన్నీ జనసముద్రం అయ్యాయి. అడుగడుగున యువత తెలుగు తమ్ముళ్ళు, మహిళలు, ప్రజలు నీరాజనాలు పలికారు. హారతులు పట్టారు. పూల వర్షం కురిపించారు. వేలాదిగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలసి భారీ ర్యాలీగా తరలివచ్చి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్‌లు దాఖలు చేసేందుకు అనగానికి చేపట్టిన ర్యాలీకి అపురూప స్పందన లభించింది. రేపల్లె పట్టణం అంతా డీజే సౌండ్లు, డప్పు నృత్యాలు, గజ్జల చప్పుళ్ళు మారుమ్రోగాయి. రహదారులన్నీ పసుపుమయంగా మారాయి. రేపల్లె నియోజకవర్గం నుంచి రేపల్లెరూరల్, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల నుంచి భారీగా నాయకులు పార్టీ కార్యాలయానికి తరలి వచ్చారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఇంటి వద్ద నామినేషన్‌లకు బయలుదేరే ముందు సోదరిలు డాక్టర్ మంజుల, కమలలు దిష్టి తీసి హారతులు ఇచ్చారు. రేపల్లె గ్రామదేవత అయిన బూరుగలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మార్కెట్ వద్ద వినాయకుని గుడిలో పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయానికి వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నామినేషన్ దాఖలు చేసేందుకు ఆర్డీవో కార్యాలయానికి భారీ ర్యాలీతో వెళ్ళారు. కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తమ నామినేషన్ పత్రాన్ని ఆర్‌వో హేలా షారోన్‌కు అందజేశారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ వేములపల్లి సుబ్బారావు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, ఎలక్షన్ ఛీఫ్ కొమ్మూరు వెంకటేశ్‌లు ఉన్నారు.

కూటమిపై తప్పుడు ప్రచారాలు

- ఓటమి భయంతో విషం చిమ్ముతున్న సీఎం జగన్
- ప్రజలు అప్రమత్తమై న్యాయాన్ని గెలిపించుకోవాలి
- రచ్చబండ కార్యక్రమంలో మంగళగిరి అభ్యర్థి లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 24: ఓటమి భయంతో జగన్ కూటమి పార్టీలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నది. టీడీపీపై విషం చిమ్ముత్తున్నారు. జగన్, ఆయన గ్యాంగ్ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. న్యాయాన్ని గెలిపించుకోవాలి... అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన చినకాకాని, ఎర్రబాలెం, సీతానగరం ప్రాంతాల్లో రచ్చబండ కార్యక్రమాల ద్వారా స్థానికులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ సర్వేలోనే కూటమి ప్రభంజనం ఖాయమన్న సంకేతాలు స్పష్టంగా వస్తుండడంతో జగన్ అండ్ కో విష ప్రచారాలనే ఆయుధాలుగా మలుచుకుంటుందన్నారు. జగన్ మాయలో పడి కొందరు కాపు నేతలు సైతం ఏవేవో మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ నేతలు నాడు రిజర్వేషన్ల విషయంలో జగన్ చేసిన దుర్మార్గాన్ని ఎందుకు ప్రశ్నించలేక పోతున్నారని ప్రశ్నించారు.. నిజానికి కాపులకు తమ ప్రభుత్వం చేసిన దాంట్లో వైసీపీ ప్రభుత్వం పది శాతమైనా చేసిందో లేదో పరిశీలించుకోవాలన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే తాము బీజేపీతో పొత్తు పెట్టుకోవల్సి వచ్చిందని వివరించారు. కూటమి ప్రభుత్వం వస్తే క్రైస్తవులను, ముస్లింలను ఇబ్బందులు పెడతామంటూ వైసీపీ చేస్తోన్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. 2014లో తాము బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని నడిపినపుడు క్రైస్తవులకు, ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కాపాడుకుంటూ వచ్చామని తెలిపారు. క్రిస్మస్ కానుకలు, రంజాన్ తోఫా అందించిన ఘనత తమ టీడీపీ ప్రభుత్వానిదన్న సంగతి మరువరాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజల మధ్య ధైర్యంగా, స్వేచ్ఛగా తిరుగుతానే తప్ప మాట తప్పి మడమ తిప్పి భయంతో పరదాలు కట్టుకుని మాత్రం తిరగనంటూ వ్యంగ్యాస్త్రాలను సంధించారు. జగన్ అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. రేపల్లెలో అక్కను అవమానించిన వైసీపీ కిరాతకుడ్ని ప్రశ్నించినందుకు ఆమె సోదరుడు అమర్‌నాథ్ గౌడ్‌ను పెట్రోలు పోసి అన్యాయంగా హత్య చేశారన్నారు. ఈ దారుణ ఘటన చూశాక బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని ఆనాడే నిర్ణయించుకున్నామని తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ చట్టాన్ని తీసుకొచ్చి బీసీలను అవమానించిన వారినందరినీ జైలుకు పంపుతామని చెప్పారు.



ప్రసంగిస్తున్న నారా లోకేశ్



చినకాకాని చర్చిలో లోకేశ్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్ జోజయ్య



● ఎర్రబాలెం రామాలయంసెంటర్‌లో లోకేశ్ సభకు హాజరైన జనం

కిలాడి.. మేత

- ఉద్యోగుల ఇళ్ల స్థలాలు కాజేసిన పొన్నూరు వైసీపీ నేత
- అప్పనంగా ఆరు ప్లాట్లు.. రూ.3 కోట్లు ముడుపులు
- ముఖ్యనేత అండతో రెచ్చిపోయిన ఎన్జీవో నేతలు
- సంఘంతో సంబంధం లేని వారికి రిజిస్ట్రేషన్లు
- పూజారులు, అధికార పార్టీ నాయకులు, వ్యాపారులకు ప్లాట్లు



ఇదీ సంగతి..

పొన్నూరు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే లక్ష్యంతో 2004లో ఒక ఎన్జీవో సొసైటీని ఏర్పాటు చేశారు. సాక్షి భవన్నారాయన స్వామి దేవస్థానంకు చెందిన 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. సర్వే నెంబర్ 221-1 లోని ఈ భూమిని ఎకరం రూ.4 లక్షలు చొప్పున అప్పటి ఉద్యోగుల నుంచి సేకరించిన సొమ్ముతో కొనుగోలు చేశారు. 3 సెంట్లు చొప్పు న 98, 4 సెంట్లు చొప్పున 146 ప్లాట్లను ఏర్పాటు చేశా రు. అప్పట్లో ఈ విషయంలో వివాదం తలెత్తడంతో రిజిస్ట్రే షన్ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. అప్పట్లో వున్న చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ పొందగా, కొం దరు మరణించారు. కొద్దిరోజుల క్రితం ప్లాట్ల రిజిస్ట్రేషన్ కు మార్గం సుగమం కావటంతో ఎన్జీవో నేతలు పొన్నూ రు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని సంప్రదించారు. రిజి స్ట్రేషన్ ప్రక్రియలో సహకరించాలని కోరారు.

గుంటూరు ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులోని ఆ వైసీపీ నేత కన్ను పడితే అంతే. ముడుపులు అయితే ఇంటికి వెళ్ళాలి. స్థలా లు.. పొలాలు అయితే ఆయన బినామీల పేరుతో మారాలి. గడచిన ఐదేళ్ల కాలంలో ఎంత తిన్నా ఆకలి తీరని ఆయన చివరకు చిన్నా చితక ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు ఎసరు పెట్టేసారు. ఎన్జీవో (నాన్ గజిటెడ్ అసోసియేషన్)లకు చెందిన ఇళ్ల స్థలాలను తన బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా రూ.6 కోట్లు ఖర్చుల రూపేనా వసూలు చేయించి అందులో రూ. కోట్లు ముడు పులు కింద కొట్టేశారు. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడున్న ఎన్జీవో నేతలు రెచ్చిపోయారు. ఒక్కొక్కటి రూ.40 లక్షలు విలువ చేసే ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల ప్లాట్లను టోకున అమ్మేశారు. పూజారులు, వ్యాపారులు, వైసీపీ నాయకులను ఉద్యోగుల కింద చేర్చేసి రిజిస్ట్రేషన్‌లు చేశారు. పొన్నూరు వైసీపీ ముఖ్య మేత, ఎన్జీవో నేతలు ఆడిన ఆ ప్లాట్లాటలో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరి గింది. ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో ఇక్కడ జరిగిన అక్రమాలపై కేస్ ఫైల్ అయ్యింది.

పక్కా సెటిల్‌మెంట్

ఎన్జీవో సంఘ నేతలు సంప్రదింపుతో అప్రమత్తం అయిన నియో జకవర్గ నేత కొన్ని ప్లాట్లు తనకు రిజి స్ట్రేషన్ చేయాలని సూచిం చారు. కనీసం 10 ప్లాట్లు అయినా తనకు కావాలని పట్టుపట్టారు. చివరకు 6 ప్లాట్లు, వసూలు చేసిన సొమ్ములో సగం ఇచ్చేటట్లు ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తెరలేపారు.

అన్నీ అక్రమాలే..

నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడి ఎన్జీవో నేతలు తోటి ఉద్యోగుల ప్రయోజనాలను తుంగలో తొక్కేశారు. అసలు ఉద్యోగులు కాని వారికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేశారు. అందుకోసం అనేక అడ్డదారులు తొక్కేశారు. ఒక్కొక్క ప్లాట్ రిజిస్ట్రేషన్ కు ఉద్యోగుల వద్దనుంచి ఖర్చులు కింద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు వసూలు చేశారు. ప్రస్తుతం అక్కడ మంచి ధర ఉండటంతో ఒక్కొక్క ప్లాట్ రూ.40 లక్షల వరకు పలుకుతుంది. దాన్ని సాకుగా చూపించి ప్రతి ఉద్యోగి వద్ద నుండి వీలైనంత ఎక్కువ గుంజేశారు. అసలు ఉద్యో గులు కాని వారికి ప్లా ట్లు కట్టబెట్టారు. అందు కోసం రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. భూమి కొనుగోలుకు నగదు చెల్లించి మధ్యలో మరణిం చిన వారి ప్లాట్లను వారి పిల్లలకు ఇవ్వకుం డా బయట అమ్మేసినట్లు తెలుస్తోంది.

తిలా పాపం.. తలా పిడికెడు

మొత్తం మీద పొన్నూరు ఎన్జీవో ప్లాట్లలో భారీగానే వసూలు చేసినట్లు ఆ రోపణలు ఉన్నాయి. అధి కారిక లెక్కలు ప్రకారం సుమారు రూ.6 కోట్ల వరకు చేతులు మారినట్లు చెబుతున్నారు. అందు లో రూ.3 కోట్లు ముఖ్య నేతకు వెళ్లగా, మిగిలిన సొమ్ము ఎన్జీవో నాయకులు వాటాలు వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుం టూరులోని ఒక కార్యాలయంలో కొందరు నాయకులు డబ్బులు పంచుకునే విధానాన్ని బాధితుడు వీడియో తీసి మీడియాకు అందించారు. ఈ అక్రమాలపై అక్కడి ముఖ్య నేతలు ఇప్పటికే హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఉద్యోగ సం ఘ నాయకులపై కూడా ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది.

భారీగా స్టాంప్ డ్యూటీ ఎగవేత?

ఎన్జీవో సంఘం పేరిట పొన్నూరులో జరిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భారీగా స్టాంపు డ్యూటీ ఎగవేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ముఖ్యనేత ఒత్తిడి కి తలొగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నామమాత్రపు స్టాంపు డ్యూటీతో ప్లాట్లను బదలాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి స్టాంపు డ్యూటీ మినహాయింపు పొందాలంటే ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇవ్వాలి. అటువంటిది ఇక్కడ ఏమి జరగలేదని అంటున్నారు. ఒక వేళ అటువంటి వెసులు బాటు వున్నా అది కేవలం ఎన్జీవో జాబితాలో ముందు నుంచి ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుంది. ఇక్కడ ఇష్టం వచ్చినట్లుగా, జాబితాతో పనిలేకుండా ప్రక్రియ జరిగి నందువల్ల స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండి పడినట్లు సమాచారం.

అసలు ఉద్యోగులే కాదు

పొన్నూరు ఎన్జీవో నేతలు అంతులేని అక్రమాలకు తెరలేపారు. అసలు ఉద్యోగులు కానివారికి ప్లాట్లు రిజిస్టర్ చేశారు. ఉదాహరణకు.. పోతన వెంకట్రావు పేరుతో ప్లాట్ నెంబర్: 21ని డాక్యుమెంట్ 4705/2023 ద్వారా రిజిస్టర్ చేశారు. అతను ఎన్జీవో సంఘానికి చెందిన వారు కాదని తెలుస్తోంది. ప్లాట్ నెం బర్:211ను వి.సత్యానారాయణకు డాక్యుమెంట్ 4775/2023 ద్వారా రిజిస్టర్ చేశారు. ఆయన కూడా ఎన్జీవో కాదని తెలుస్తుంది. జాబి తాలో మరొకరి పేరు ఉండగా, ఈయన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం. ఇప్పటి వరకు మొత్తం 200 ప్లాట్లు వివిధ వ్యక్తుల పేరిట రిజిస్టర్ కాగా, అందులో అధిక భాగం ఇతరుల ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్అండ్‌బీలో పనిచేసే ఉద్యోగుల పేరిట కొన్ని ప్లాట్లు రిజిస్టర్ కాగా అదే రోజున వాటిని వేరే వారి పేరు మీదకు మార్చేశారు. నియోజకవర్గ నేత బినామీలకు అదే పద్దతిలో రిజిస్ట్రేషన్ జరిగింది.





గుర్తుతో బెలూన్‌లు, బాలాజీ బొమ్మతో ఉన్న టీషర్టులు

పట్టుకున్నారు.. మరి కేసు?

- 1525 వైసీపీ అభ్యర్థి టీ షర్టులు స్వాధీనం
- పిట్టలవానిపాలెం చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో గుర్తింపు
- పర్చూరు వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ పేరుతో రశీదు

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సామగ్రి, నగదు, తాయిలాలకు సంబంధించిన వస్తువులు తరలిస్తుంటే సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం.. అని ఎన్నికల అధికారులతో పాటు పోలీసులు నిత్యం హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే బుధవారం పిట్టలవానిపాలెం చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రిపై కేసు నమోదు చేయలేదు. ఇందుకు సంబంధించి పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ బొమ్మతో ఉన్న 1525 టీ షర్టులతో పాటు 500 ఫ్యాన్ గుర్తుల బెలూన్లను పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ (స్టాటస్టిక్ సర్వేలైన్స్ టీమ్స్)తో పాటు పోలీసులూ సంయుక్తంగా సోదాలు నిర్వహించగా హైదరాబాద్ నుంచి చీరాల వెళుతున్న ట్రావెల్ బస్సులో వీటిని గుర్తించారు. వీటికి సంబంధించి రిసీవింగ్ రశీదు ఎడం బాలాజీ పేరు మీద ఉన్నట్లు సమాచారం. వీటిని చందోలు పోలీస్ స్టేషన్‌కు తరలించగా జీఎస్‌టీ అధికారులు వచ్చి వాటి విలువను లెక్కకట్టారు. అయితే సంబంధిత ఆర్వో అనుమతి లేకుండా రూ.10 వేలకు మించి సామగ్రి కొనుగోలు చేయాలి లేదంటే కేసు నమోదు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే పిట్టలవానిపాలెం వద్ద పోలీసులు పట్టుకున్న వాటి విలువ దాదాపు లక్ష రూపాయలపైనే ఉండొచ్చని తెలుస్తోంది. కానీ కేసు నమోదు లేకపోగా ఆ సామగ్రిని స్టేషన్‌లో ఉంచడంతో సరిపెట్టారు.

హామీలిచ్చి వంచన

- ఒక్క వాగ్దానం నెరవేర్చని జగన్
- కృష్ణానదిపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ఎక్కడ?
- రేపల్లె న్యాయయాత్రలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

రేపల్లె, ఏప్రిల్ 24: అధికారం కోసం జగన్ ఎన్నో హామీలు ఇచ్చారు.. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చలేదు. ప్రజలను వంచించారు.. అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రేపల్లెలో షర్మిల న్యాయయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో ప్రసంగించారు. గత ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటైన అమలైందా అని ప్రజలు ఆలోచించాలని తెలిపారు. పదేళ్లలో అభివృద్ధి గురించి ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. ఏ వర్గానికి న్యాయం చెయ్యనిపరిస్థితి నెలకొందన్నారు. రైతులకు లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని, కృష్ణానదిపై రెండు చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన జగన్ ఐదేళ్లుగా వాటి విషయం మరిచిపోయారన్నారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ఆక్వా పార్కును ఏర్పాటు చేస్తామన్న హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. రేపల్లెలో 100 పడకల అస్పత్రి ఏమైందని ప్రశ్నించారు. నిజాంపట్నం హార్బర్‌ను అభివృద్ధి చేస్తామన్నారని, కానీ కనీసం 20 శాతం పనులు కూడా చేసిన దాఖలాలు లేవన్నారు.

వైఎస్‌ను తిట్టిన వారికే పెద్దపీట

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌ను తిట్టిన వారికే జగన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. వైఎస్ సతీమణి తన తల్లి విజయమ్మను సైతం అవమానపరిచిన వారిని జగన్ వెనకేసుకు వచ్చారన్నారు. పైగా వారినే పక్కన పెట్టుకుని తండ్రి లాంటి వారని సంభోదిస్తూ ఓట్లు అడగడాన్ని ఎద్దేవా చేశారు. జగన్ తన క్యాబినెట్‌లోకి తీసుకున్న మంత్రులంతా వైఎస్‌ని తిట్టిన వారేనన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదలు విడదల రజిని, రోజా అందరూ వైఎస్‌ను తిట్టిన వారేనన్నారు. వీరందరూ జగన్‌కు కావాల్సిన వాళ్లయ్యారని, ఇలాంటి వారంతా జగన్‌కు తండ్రులు, అక్కలు, చెల్లెళ్లని సంభోదిస్తున్నారని తెలిపారు. నిజంగా వైఎస్ కోసం నిలబడినవారు, జగన్ కోసం పాదయాత్రలు చేసిన వారు , జగన్ కోసం పనిచేసిన వారు ఎటుపోయారు, ఏమయ్యారని ప్రశ్నించారు.

రైతులను నాశనం చేసిన జగన్

జగన్ పాలనతో రాష్ట్రంలో అప్పులేని రైతు అంటూ లేడని షర్మిల తెలిపారు. అన్నదాతలను సీఎం నాశనం చేశారని ప్రశ్నించారు. మద్దతు ధర, ధరల స్థిరీకరణ నిధి ఎక్కడన్నారు. ఐదేళ్లలో పంట నష్ట పరిహారం మాటే మరిచారన్నారు. బాపట్ల లోక్‌సభ అభ్యర్థి జేడీ శీలం, సీపీఎం రాష్ట్ర నాయకురాలు డి.రమాదేవి మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ మోదీ చేతిలో కీలు బొమ్మలా తయారయ్యాయన్నారు. దేశాన్ని అన్ని విధాలా మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని తెలిపారు. మతాల మధ్య చిచ్చులు పెట్టే విధంగా దేశంలో పాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు, నాయకులు కేసన రామకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, సీపీఎం నాయకులు సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్ షర్మిలా

బాపట్ల పార్లమెంట్ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా గరటయ్య



అద్దంకి, ఏప్రిల్ 24: టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా అద్దంకి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్యను నియమించారు. నాలుగు దశాబ్దలకు పైగా రాజకీయాల్లో ఉన్న గరటయ్య టీడీపీ తరఫున పలు పర్యాయాలు అద్దంకి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దశాబ్ద కాలంగా వైసీపీలో ఉన్నారు. గత ఎన్నికలలో వైసీపీ తరఫున అద్దంకి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. కుమారుడు కృష్ణచైతన్య నాలుగేళ్లుగా అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా ఉండగా, 4 నెలల క్రితం పాణెం హనిమిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో గరటయ్య, కృష్ణచైతన్య వైసీపీని వీడి ఇటీవల చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ఎలక్షన్ కోఆర్డినేటర్లను నియమించిన నేపథ్యంలో అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలో 4 దశాబ్దాలకు పైగా రాజకీయంలో ఉన్న గరటయ్యకు సముచిత స్థానం కల్పించడంపై బాచిన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నారా లోకేశ్‌కు రూ.15 లక్షల డీడీని అందజేసిన ఎన్ఆర్ఐ ఓర్లాండ్ విభాగం సభ్యులు

టీడీపీ ఎన్ఆర్ఐ ఓర్లాండ్ విభాగం

రూ.15 లక్షలు విరాళం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24: అమెరికాలోని టీడీపీ ఎన్ఆర్ఐ ఓర్లాండ్ విభాగం రూ.15లక్షలు విరాళం అందజేసింది. యుఎస్ఏ ఫ్లోరిడాలో ఉంటున్న ఎన్ఆర్ఐ విభాగం సభ్యులు కనుమూరి ఈశ్వర్, పోట్లూరి మహేష్, స్నేహితులు ఈ విరాళాన్ని అందజేశారు. పల్నాడుజిల్లా నరసరావుపేట ఎన్జీవో కాలనీలో ఉంటున్న వారి బంధువుల ద్వారా ఈ విరాళాన్ని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలిసి రూ.15 లక్షల డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కనుమూరి ఆంజనేయులు, జాష్టి బాబు, ఈదర శ్రీనివాసరావు, సూరే రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్స్ యూనివర్సిటీతో

రోబోకప్లర్ అవగాహన ఒప్పందం

గుంటూరు(విద్య), ఏప్రిల్24: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీతో వైజాగ్‌లోని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని బుధవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లాతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగభూషణ్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీలోని బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు భారతదేశపు ప్రీమియర్ ఆండ్రో హ్యూమనాయిడ్ రోబోటిక్ కంపెనీ రోబోకప్లర్‌తో సంచలనాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుక్కెడు నీళ్లివ్వండయ్యా !

- మంచినీటి కోసం మహిళల ఇబ్బందులు

దాచేపల్లి, పిడుగురాళ్ల, ఏప్రిల్ 24: భూగర్భ జలాలు అడుగంటడంతో చేతిపంపులు, విద్యుత్ మోటర్లు పనిచేయక పోవడంతో ప్రజలు తాగునీటికోసం ఇబ్బంది పడుతున్నారు. దాచేపల్లి మండలంలో వాగులు, వంకలు, చెరువులు, పల్నాడు జీవనదిగా ప్రసిద్ధిగాంచిన నాగులేరు ఎండిపోయాయి. మార్చినుంచే ఎండిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. దాచేపల్లి నగర పంచాయతీలోని ఐదు గ్రామాలు, రూరల్‌లోని 12 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి.

తాగునీటిలో కూడా రాజకీయాలు...

నీరందించే విషయంలో కూడా రాజకీయాలు చేస్తున్నారని ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ వైసీపీ నేతల ఆధ్వర్యంలో నడుస్తుంది. మున్సిపల్ చైర్మన్‌గా వైసీపీ నేత కొనసాగడంతో మున్సిపాల్టీ నుండివచ్చే వాటర్ ట్యాంకర్లు వైసీపీ అభిమానులు, నేతలు, కార్యకర్తలు అధికంగావున్న వీధుల్లోనే చక్కర్లు కొడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. తాగే నీటి విషయంలోనూ రాజకీయాలా? వైసీపీ వాళ్లే ప్రజలా? టీడీపీ కార్యకర్తలు ప్రజలు కాదా? అంటూ మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. తాగునీటి సమస్యపై పార్టీల రహితంగా అందరికీ నీరందించాలని టీడీపీ నాయకులు మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. కమిషనర్ నిబంధనల ప్రకారం తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు కానీ అమలులో మాత్రం ఆచరణకు దూరంగా వుందని విమర్శలు వస్తున్నాయి. ప్రైవేటుగా వెయ్యి లీటర్ల ట్యాంకర్ కావాలంటే రూ.600 వసూలు చేస్తున్నారు. ఇప్పుడే ఇలా వుంటే మే నెలలో రానున్న రోహిణికార్తెలో నీటికష్టాలు అధికంగా వుంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పిడుగురాళ్లలో వీధి కులాయిల వద్ద డబ్బాలో నీటిని నింపుకుంటున్న దృశ్యం



పునాదికే పరిమితమైన పిడుగురాళ్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం

రెండేళ్లు అయినా గుక్కెడు మంచినీరు ఏదీ..

పిడుగురాళ్ల పట్టణంలో ఇంటింటికి తాగునీరు అందిస్తామని వైసీపీ నేతల ఆర్భాటపు ప్రకటనలే తప్ప గుక్కెడు నీళ్లు అందిస్తున్న పాపాన పోవడం లేదు. రెండేళ్ల క్రితం పిడుగురాళ్లలో మూడు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా నిధుల కొరతతో అవి పునాదులకే పరిమితమయ్యాయి. పట్టణంలో సుమారు 15,500కు పైగా నివాస గృహాలు వుండగా, గత ఏడాదిన్నరగా ఇంటింటికి తాగునీరు అందించే పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఏడాది లోపే ఇంటింటికి నీళ్లిస్తామన్న పాలకుల మాటలు జనం నమ్మడం లేదు.

రెండేళ్లు అయినా పునాదులకే పరిమితమైన వాటర్ ట్యాంక్ పనులు, నత్తనడకన కొనసాగుతున్న ట్యాప్ కనెక్షన్‌ల పనులు మరో ఏడాదికి పైగా పట్టే అవకాశం వుంది. ఈ వేసవిలో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఏరియా, బెల్లంకొండ డొంక, డ్రైవర్స్ కాలనీ, సంజీవరెడ్డినగర్, రసూల్‌పేట, వాసవినగర్‌తో పాటు శివారు ప్రాంతాలలోనూ నీటి ఎద్దడి రావడంతో మున్సిపల్ అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న నీళ్లు ఏ మూలకు సరిపోవడం లేదు. టీడీపీ నేతలు దాతలుగా మారి స్వచ్ఛందంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.



దాచేపల్లిలో నీళ్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్న దృశ్యం

వైసీపీ నేతల చేతివాటం

- పంచాయతీ స్థలానికి బేరసారాలు

కారంపూడి, ఏప్రిల్ 24: వైసీపీ నేతల చేతివాటంతో పంచాయతీ స్థలం కబ్జాకు గురవుతోంది. వివరాల్లోకి వేళ్తే... స్థానిక శాఖా గ్రంథాలయానికి వెళ్లే ముందుభాగాన్ని ఓ వ్యాపారి గ్యాస్ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. వైసీపీ నేత అండదండలతో పంచాయతీకి రూ.500 అద్దె కడుతున్నట్లు వ్యాపారి తన పేరుపై రశీదు పొందుతున్నాడు. ఆరు నెలల క్రితం ఆ షాపులో గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆషాపును తొలగించాలని గ్రంథాలయ రీడర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు, సరిహద్దు వ్యాపారులు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేశారు. అయితే సదరు వ్యాపారి ఈ షాపును వేరే వ్యాపారి జ్యూస్ షాపునకు రూ.3500కు అద్దెకిచ్చాడు. అంతటితో ఆగక తనకు రూ.లక్షన్నర కావాలంటూ వైసీపీ బడా నేతల ద్వారా డిమాండ్ చేశాడు. కాగా ఇందులో మరో వైసీపీ ముఖ్య నేత కల్పించుకొని పంచాయతీలో రూ.500 అద్దెకట్టేలా జ్యూస్ వ్యాపారి పేరుపై రాయించాడు. వైసీపీ వర్గపోరుతో ఈ విషయం బయటకొచ్చింది. దేనికైనా సిద్ధమంటూ ఇరువురు వైసీపీ నేతలు హెచ్చరికలు కూడా చేసుకున్నారు. గ్యాస్ వెల్డింగ్ వ్యాపారి తనంతట తాను షాపు తొలగించుకుంటున్నాడు. ఈ క్రమంలోనైనా గ్రంథాలయానికి స్త్రీలు కూడా వెళ్లేందుకు మెరుగైన మార్గం కల్పించాలని అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. కాగా జ్యూస్ వ్యాపారి తరపున నిలిచిన వైసీపీ నేత మాత్రం జ్యూస్ వ్యాపారం నిర్వహించుకునేలా చూసేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కాగా వైసీపీ నేతల చేతివాటం చర్చనీయాంశంగా మారింది.



అక్రమంగా నిర్మించిన గదిని తొలగిస్తున్న వ్యాపారి



కంకటపాలెం గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై ఉన్న వైసీపీ జెండాలు

ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై వైసీపీ జెండాలు

బాపట్ల, ఏప్రిల్ 24 : బాపట్ల మండలం కంకటపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై వైసీపీ జెండాలు కట్టారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పటికీ కొద్దిరోజులుగా జెండాలు ఎగురుతున్న అధికారులు తొలిగించకపోవటం పట్ల అనేక విమర్శలు వస్తున్నాయి. జెండాలను తొలిగించాలని తెలుగుదేశం నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈవిషయమై ఎంపీడీవో పర్రె విజయశేఖర్ దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే తొలిగిస్తామని గ్రామ కార్యదర్శిపై తగువిధంగా స్పందిస్తామన్నారు.

కోన రఘుపతిపై ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్ 24: ప్రభుత్వ అసైన్డ్‌భూమిని ప్రైవేట్‌భూమి అని తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యే కోన రఘుపతి అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు బుధవారం ఆర్వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోన రఘుపతి ఆర్వోకు ఇచ్చిన సమాచారంలో ఈవిధంగా వివరాలు తెలియజేశారన్నారు. సదరు భూమి మార్కెట్ విలువను కూడా తప్పుడుగా చూపించారని పేర్కొన్నారు. కావున దీనిపై చట్టప్రకారం విచారణ జరిపి ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు పరిచి తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి

దాచేపల్లి, ఏప్రిల్24: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న మహిళను వైనుకవైపు నుంచి మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొనడంతో తీవ్రగాయమై వైద్య చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బుధవారం దాచేపల్లి మండలం గామాలపాడులో జరిగింది. గ్రామానికి చెందిన సంకుల యశోదమ్మ(51) భర్త నరసయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పనులకు ఈ నెల 22వ తేదీన వెళ్లింది. అదే గ్రామానికి చెందిన మరో యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ముందువెళ్తున్న యశోదమ్మ వాహనాన్ని వెనుకవైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన యశోదమ్మ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలికి ఇరువురు సంతానం వున్నారు. ఈ మేరకు దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20కి బదులు రూ.20 వేలు చెల్లింపు

- ఆన్‌బోర్డు టీటీఈకి ఫిర్యాదు చేసిన బాధిత ప్రయాణికుడు
- నగదుని వాపస్ చేయించిన రైల్వే అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీ ద్వారా తప్పుగా బదిలీ చేసిన అదనపు నగదుని గుంటూరు రైల్వే డివిజన్ కమర్షియల్ అధికారులు సంబంధిత వెండార్ నుంచి ప్రయాణీకుడికి తిరిగి ఇప్పించి ప్రశంసలందుకొన్నారు. షేక్ షాబుల్ ఇస్లాం అనే ప్రయాణీకుడు ఈ నెల 23న సికింద్రాబాద్ నుంచి హౌరాకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో వెళుతూ గుంటూరు రైల్వేస్టేషన్‌లో టెట్రా పాల ప్యాకెట్‌ని కొనుగోలు చేశాడు. అలానే మరి కాసేపటికి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి దానికి రూ.20 బదులు రూ. 20 వేలు నగదు బదిలీ చేశారు. ఈ విషయాన్ని కాసేపటికి ప్రయాణీకుడు తెలుసుకొని ఆన్‌బోర్డు టీటీఈకి సమాచారం ఇచ్చారు. టీటీఈ ఈ విషయాన్ని గుంటూరు కమర్షియల్ కంట్రోలర్‌కు నివేదించగా ఆయన సంబంధిత కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌ని పాల ప్యాకెట్ విక్రయించిన వెండార్ వద్దకు పంపించి యూపీఐ చెల్లింపులను తనిఖీ చేయించారు. అదనపు నగదు వెండార్ బ్యాంకు అకౌంట్‌కు జమ అయినట్లు నిర్ధారించి ఆ మొత్తాన్ని ప్రయాణీకుడు ఇస్లాంకు యూపీఐ ద్వారా చెల్లింపుచేయించారు. ఈ సందర్భంగా కమర్షియల్ అధికారులు, సిబ్బందిని డీఆర్ఎం ఎం.రామకృష్ణ, డీసీఎం కోఆర్డినేషన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ అభినందించారు.

గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లు

మే9,10 తేదీల్లో గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నెంబరు 07025 కాచీగూడ - గుంటూరు రైలు మే 9వ తేదీన రాత్రి 8.30కి బయలుదేరి 11.55కి పిడుగురాళ్ల, అర్ధరాత్రి దాటాక 12.20కి సత్తెనపల్లి, 1.45కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 8గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నెంబరు. 07026 కాకినాడ టౌన్ - కాచీగూడ రైలు మే10న సాయంత్రం 5.10కి బయలుదేరి రాత్రి 10.40కి గుంటూరు, 11.23కి సత్తెనపల్లి, 11.55కి పిడుగురాళ్ల, మరుసటి రోజు వేకువ జామున 4.50కి కాచీగూడ చేరుకొంటుంది.



గుంతలో కూరుకుపోయిన బస్సు వెనుకభాగం

తృటిలో తప్పిన ప్రమాదం

కారంపూడి, ఏప్రిల్24: ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు వెనుకవైపు గుంతలో కూరుకుపోయిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల వద్ద బుధవారం జరిగింది. చిలకలూరిపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ (బీహెచ్ఎల్)కు బయలుదేరింది. మార్గమధ్యంలోని ఒప్పిచర్ల వద్ద అకస్మాత్తుగా వెనుకబాగం కొంత గుంతలో కూరుకుపోయింది. వైనుక వైపు టైర్లు ఊడిపోయి పొలాల్లోకి వెళ్లాయి. బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు దిగిపోయారు. పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మనోహర్‌కు వైసీపీ కౌన్సిలర్ మద్దతు

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: అధికార పార్టీ వైపీపీ కౌన్సిలర్ జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి మద్దతు తెలపడం వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అదే రోజు నామినేషన్ వేస్తుండగా అధికార పార్టీకి చెందిన 31వ వార్డు కౌన్సిలర్ మానసారెడ్డి దంపతులు నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆయన విజయానికి సహకరిస్తామని చెప్పడం వైసీపీ వర్గాలను షాక్‌కు గురిచేసింది. త్వరలోనే తన అనుచరవర్గాలను కలుపుకుని జనసేన పార్టీలో చేరనున్నట్లు మనోహర్‌కు తెలిపారు. ఇదే బాటలో అధికార పార్టీకి చెందిన మరో నలుగురు కౌన్సిలర్లు వైసీపీని వీడి ఉమ్మడి పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఒక పక్క ఎమ్మెల్యే శివకుమార్ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ వేసేందుకు వెళుతుంటే మరో పక్క అదే పార్టీలో కీలకంగా ఉన్న నేతలు పక్క పార్టీలో చేరికల కోసం మంతనాలుజరపడం చర్చనీయాంశంగా మారింది. అయితే రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో అధికార పార్టీని వీడి ఉమ్మడి పార్టీల అభ్యర్థులకు మద్దతు పలికేలా చేరికలు జరగనున్నట్లు విస్వసనీయ వర్గాల సమాచారం.

ధూళిపాళ్ళపై 16 క్రిమినల్ కేసులు

పొన్నూరుటౌన్, ఏప్రిల్24: పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌పై 16 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిడ్‌లో పేర్కొన్నారు. ఈ 16 క్రిమినల్ కేసులు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నమోదైనవి కావటం గమనార్హం. నరేంద్ర కుమార్ పేరుపై చరాస్తులు రూ.2,21,64,554 ఉన్నాయి. స్వగ్రామంలో 4.47 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే స్థిరాస్తుల విలువ రూ.1,66,15,772 విలువగా పేర్కొన్నారు. అలాగే రూ.9.70 లక్షలు రుణం ఉన్నట్లుగా తెలిపారు. షేర్ల రూపంలో రూ.1,44,08,748 ఉన్నట్లు ఆఫిడవిట్‌లో చెప్పారు. సతీమణి జ్యోతిర్మయి పేరు మీద రూ.1,91,30,851 చరాస్తులు, రూ.6,57,70,000 స్థిరాస్తులు అలాగే రూ.2,74,85,204 అప్పులు ఉన్నట్లు చెప్పారు. షేర్ల రూపంలో రూ.33,97,574 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు.



గుంటూరు జీజీహెచ్‌లో పిల్లల వార్డును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 24: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని పిల్లలవార్డు, కాన్పుల వార్డులను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇటీవల కాలంలో ఆసుపత్రుల్లో పిల్లల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్ఐడీ పని తీరును ఆయన పరిశీలించారు. తల్లి బిడ్డ చేతులకు తగిలించిన ట్యాగ్ పని తీరును ఆయన గమనించారు. పసి బిడ్డలకు ట్యాగ్స్ అమర్చే ప్రక్రియను నర్సింగ్ సిబ్బందే నిర్వహించాలని డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వైకిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, ఆస్పత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పిటిషనర్లకు రక్షణ కల్పించండి

- పల్నాడు పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పల్నాడు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఎం.యేసుదానం మరో 49 మంది, అలాగే జంగమేశ్వరపాడుకు చెందిన గుమ్మ పెదరాజయ్య మరో 24మంది హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరపున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ సానుభూతిపరుల కుటుంబాలపై వైసీపీ నేతలు దాడి చేసి గ్రామాల నుంచి వెళ్లగొట్టారన్నారు. ప్రాణభయంతో పిటిషనర్లు ఇతర గ్రామాలకు వెళ్లి తలదాచుకున్నారన్నారు. సొంతగ్రామాలకు వెళ్లి సాధారణ జీవనం సాగించేందుకు రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ...పిటిషనర్లు తమ సొంత గ్రామాలకు వెళ్లి సాధారణ జీవితం గడిపేందుకు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామన్నారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి పిటిషనర్లకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించారు. వ్యాజ్యాలను పరిష్కరించారు.



టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ జయరాంను సత్కరించిన మురళీకృష్ణ తదితరులు

టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్

కోమటి జయరాంకు సత్కారం

కొల్లూరు, ఏప్రిల్ 24: టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ కోమటి జయరాంను ఆయన టీమ్ సభ్యులను టీడీపీ మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ సత్కరించారు. బుధవారం కొల్లూరులోని టీడీపీ కార్యాలయానికి ఎన్నారై సెల్ టీమ్ సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారితో మైనేని పలు విషయాలు చర్చించారు. అనంతరం జయరాంతో పాటు ఎన్నారై టీమ్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో కోగంటి హరిబాబు, గద్దె నాగేశ్వరరావు, గోగినేని వెంకటేష్, మున్నంగి విజయ్, కాసరనేని మోహన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీగా మద్యం దిగుమతి

ముప్పాళ్ళ ఏప్రిల్ 24: సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబు బుధవారం నామినేషన్ వేయనున్న సందర్భంగా ఆ పార్టీ నేతలు ముప్పాళ్ళ మండలంలోకి భారీగా మద్యాన్ని దిగుమతి చేశారు. మండంలో ప్రతి పోలింగ్ బూత్‌కి 4 నుండి 5 కేసుల మద్యాన్ని ఇప్పటికే గ్రామాలలోకి తరలించారు. కొన్ని గ్రామాలలో ప్రజలను నామినేషన్‌కు సమీకరించేందుకు ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చామని ఆ పార్టీ గ్రామ స్థాయి నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. మండలంలోని ఇరుకుపాలెంకు చెందిన నాయకులు ఆటోలో తెస్తున్న మద్యాన్ని మంగళవారం రాత్రి సత్తెనపల్లి పట్టణంలో ఎన్నికల తనిఖీ బృదం పట్టుకుని 280 క్వాటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ మద్యం అంబటి రాంబాబు నామినేషన్ కార్యక్రమం నిమిత్తం పంపిణీ చేసేందుకు గ్రామాలకు తరలిస్తున్నవేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల అధికారులు ఇకపైనా గ్రామాలలోకి వస్తున్న ఎన్నికల తాయిలాలను పకడ్బందీగా కట్టడి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నగదు, వెండి సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 24: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రూ.1,37,000, రూ.1,30,000 నగదు, తెనాలి నియోజకవర్గంలో రూ.2,38,700 విలువ కలిగిన 3,410 గ్రాముల వెండి సీజ్ చేసినట్టు ఆధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రూ.2,41,26,165 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

అభివృద్ధిని విస్మరించి.. అప్పులు మిగిల్చి..

- ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే !
- 1590వ రోజుకు రైతులు ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో మహిళల నిరసన

తుళ్లూరు, ఏప్రిల్ 24: అమరావతి అభివృద్ధిని పక్కనపెటి రాష్ట్రానికి అప్పులను మిగిల్చిన సీఎం జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగావున్నారని రాజధాని నిర్మాణానికి భూములు త్యాగంచేసిన రైతులు అన్నారు. రాజధాని ప్రాంత ప్రజల ఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1590వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఒక్కో తల మీద జగన్‌రెడ్డి రూ.3 లక్షల అప్పు పెట్టారని ఆరోపించారు. వాటికి వడ్డీలు కట్టేందుకే ప్రజలపై ధరల భారాలను, పిచ్చి పన్నులను మోపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధ్వంసక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి, అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థవంతగా అమలుచేసే నేతను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి.

72,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 69,174 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 72,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	14500
273	7500	13500
341	8000	16500
4884	9500	13000
సూపర్ 10	10000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	15000
దేవనూరు డీలక్స్	8500	15000
తెల్లకాయలు	5000	--

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

ఎమ్మెల్యే కోన అవినీతి, అక్రమాలు ప్రజలలోకి తీసుకెళ్ళాలి

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



సమావేశంలో మాట్లాడుతున్న వేగేశవ నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 24 : బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అవినీతి, అక్రమాలు గురించి ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని వెంగళ్‌విహార్‌లో అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 5 రోడ్లు అభి వృద్ధి చేసి గొప్పలు చెప్పుకోవటం సరికాదన్నారు. రైతులకు అవసరమైన సాగునీటి కాల్వలు, డ్రైనేజీలు ఏమాత్రం అభివృద్ధి చేయకపోవటం దారుణమన్నారు. పట్టణంలో డ్రైనేజీలు అధ్వానంగా మారి దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలు చేస్తే బాపట్లను జిల్లా చేశానని గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటు అన్నారు. పనికిరాని వ్యక్తి బాపట్లకు అవసరం లేదని పని చేసే వారు బాపట్లలో ఉన్నారన్నారు. ఎన్నికల సంగ్రామానికి కేవలం 17రోజులు మాత్రమే ఉన్నందున ప్రతి ఒక్కరు సైనికుని వలే పని చేయాలన్నారు. 20 నుంచి 30వేల మెజార్టీతో గెలవాలనే ప్రయత్నం చేయాలన్నారు. కూటమి అభ్యర్థులు గెలవటం తధ్యమన్నారు. ప్రతి ఒక్కరు క్షేత్ర స్థాయికి వెళ్ళి బూత్ పరిధిలోని ఓటర్లు కూటమి అభ్యర్థులకు ఓటు వేసేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీల ద్వారానే విజయం సాధ్యమౌతుంది కావున దళితులంతా ఐక్యంగా తన విజయానికి కృషి చేయాలని కోరారు.

డాక్టర్ చార్వాక మాట్లాడుతూ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎస్సీలకు ఇవ్వటం ఇష్టం లేని ఎమ్మెల్యే కోనకు మద్దతు ఇవ్వటం సరికాదన్నారు. ప్రాంతీయ పార్టీలలో క్రమశిక్షణ కలిగిన పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. ఇప్పటి వరకు దళిత ఉద్యమాల కోసం పని చేశామని ఓటు వేయమని అడగలేదన్నారు. మన బిడ్డల భవిష్యత్తు కోసం ఈసారి టీడీపీకి ఓటు వేయమని అడుగుతున్నామన్నారు. సునామీ కన్న ప్రమాదమైన వైసీపీని గెలిపిస్తే ఆర్థికంగా, ఆత్మగౌరవం దెబ్బ తీస్తారన్నారు. దళితుల గౌరవం దెబ్బతింటుంది కావున ప్రతి ఒక్కరు కూటమికి అండగా ఉండాలని కోరారు. సమావేశంలో ఎస్సీసెల్ నాయకులు ముప్పిరి రాజశేఖర్, బెజ్జం వెంకటేశ్వర్లు, కత్తి దానీయేలు, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, మాలమహానాడు నాయకులు శీలం రోజన్‌బాబు, పల్లం సరోజనీ, మద్దాల ముసలయ్య, వేమవరపు సుజాత, కాగిత నాగభూషణమ్మ, దగ్గుమల్లి రాణి, దండమూడి సంధ్యారాణి, దాసరి లక్ష్మీ, పల్లం జీవన్, తోట నారాయణరావు, జికె.నాయుడు, పమిడి భాస్కరరావు, కిషోర్, అవినాష్, గొర్రెముచ్చువందనం పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ మాజీ సర్పంచ్



పూర్ణకుమారికి కండువా కప్పి టీడీపీలో చేర్చుకుంటున్న నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 24 : మండలంలోని నరసాయపాలెం గ్రామానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ దొప్పలపూడి పూర్ణకుమారి తెలుగుదేశంపార్టీలో చేరారు. ఎంతోకాలంగా వైసీపీలో ఉంటూ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ఆమె ఎన్నికల ప్రచారానికి వెళ్ళిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టీడీపీలో చేరటంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు. అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఆమెకు నరేంద్రవర్మ కండువాకప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, కళ్ళం హరినాథరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఆరుగురు నామినేషన్లు దాఖలు

బాపట్ల, ఏప్రిల్ 24 : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఆరుగురు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. సమాజ్‌వాదిపార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌కు అందజేశారు. నామినేషన్ కార్యక్రమానికి ముందు మేదా కాలేజి దగ్గర నుంచి ఆర్వో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అదేవిధంగా జనవాహ్ని పార్టీ నుంచి యెనుముల భాస్కరరావు, విముక్తి చిరుతల కక్షి పార్టీ నుంచి రేగులగడ్డ చంద్రశేఖరరావు, నవతరం పార్టీ నుంచి షేక్ కరీం, తెలుగు విజయం పార్టీ నుంచి బెజ్జం మల్లికార్జునరావు, స్వతంత్ర అభ్యర్థిగా పిట్టు బూసిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

రేపల్లెలో పది నామినేషన్లు...

రేపల్లె, ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం రేపల్లె నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు పది నామినేషన్లు వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ తెలిపారు. టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ రెండు నామినేషన్లు దాఖలు చేయగా, అనగాని మంజుల రెండు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు ఒక నామినేషన్ దాఖలు చేయగా, బీఎస్పీ అభ్యర్థి డొక్కా శ్రీనివాసరావు, జైభీమ్ భారత్ పార్టీ తరుపున దోవ రమేష్‌రాంజీ, ఇండిపెండెంట్‌లుగా రెండు నామినేషన్లు మహ్మద్ కాశీ, బొర్రా శ్రీనివాసరావు వేశారు. జైభారత్ నేషనల్ పార్టీ తరుపున అంద్రాజు రామరాజు నామినేషన్‌ను దాఖలు చేశారు.

వేమూరు అసెంబ్లీకి ఎనిమిది నామినేషన్లు...

వేమూరు, ఏప్రిల్ 24: వేమూరు అసెంబ్లీ ఎన్నికలకు బుధ వారం ఎనిమిది నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బూరగ సుబ్బారావు నామినేషన్ దాఖలు చేశారు. జై భారత్ పార్టీ అభ్యర్థిగా దురు భాగ్యరాజు, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా ఎల్లమాటి శ్యాంప్రసాద్ నామినేషన్ దాఖలు చేయగా వైసీపీ పక్షాన వరికూటి అశోక్‌బాబు, వరికూటి గౌతం, రెండు డమ్మీ నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ పక్షాన మరో మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ భారత్‌జట్టుకు బాపట్ల హోలీక్రాస్ విద్యార్థి

బాపట్ల, ఏప్రిల్ 24 : అండర్-14 ఫుట్‌బాల్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో బాపట్ల హోలీక్రాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన పోటీలలో హోలీక్రాస్ స్కూల్ 7వ తరగతి విద్యార్థులు జి.యశ్వంత్, ఎస్‌డి సుభానీ పాల్గొని కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అమలావతి, కరస్పాండెంట్ జెసింత జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించారు. చదువుతోపాటు క్రీడలలో రాణించటం అభినందనీయమన్నారు. అదేవిధంగా ఎస్‌డీ సుభానీ భారత్‌జట్టుకు ఎంపికయ్యారని త్వరలో చైనాలో జరిగే అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు వెళ్ళటం గర్వకారణమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

పటేల్ నగర్‌లో అగ్నిప్రమాదం

బాపట్ల, ఏప్రిల్ 24 : పట్టణంలోని పటేల్ నగర్ 3వలైన్ పోస్టాఫీస్ ఎదురుగల పాతభవనంలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. భవనానికి సంబంధించిన వ్యక్తులు ఇతర దేశంలో ఉంటున్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకాధికారి వై. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఎల్ఎఫ్ వసంతరావు, డీవోపీ వీరయ్య, ఫైర్‌మన్ నాగయ్య, వలి, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

బాపట్ల, ఏప్రిల్ 24 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఒక్కరోజు అంతర్జాతీయ సదస్సు ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ప్రపంచ పుస్తక దినోత్సవం, ఆంగ్ల భాష దినోత్సవం సందర్భంగా రీడ్ యువర్ వే ఎంబ్రేసింగ్ ఎ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సుకు అంతర్జాతీయ స్పీకర్ డాక్టర్ జస్టిస్ జేమ్స్ పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ అధ్యక్షత వహించగా పుస్తకాలు చదవటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పీవీఎస్ మల్లేశ్వరరావు, కో కన్వీనర్ డాక్టర్ షేక్ షబ్రీన్ సుల్తానా, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బాపట్ల అభ్యర్థిగా గంటా అంజిబాబు

బాపట్ల, ఏప్రిల్ 24 : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబును ఎంపిక చేశారు. ఈమేరకు పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల చేతులమీదగా బీ ఫారం అందజేశారు. ఆయనకు కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్టు కేటాయించటంపై పార్టీశ్రేణులతోపాటు ఆయన వర్గీయులు అభినందనలు తెలిపారు.

వలంటీర్లు రాజీనామా

కర్లపాలెం, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని పాతనందాయపాలెం సచివాలయం పరిధిలో ఐదుగురు వలంటీర్స్, దుండివారిపాలెం సచివాలయం పరిధిలో 11మంది వలంటీర్లు, బుద్దాం సచివాలయం పరిధిలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేయటం జరిగిందని కర్లపాలెం ఎంపీడీవో నేతాజి తెలియజేశారు.

రేపల్లెను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

● నన్ను ఆదరించండి..

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె గ్రామ దేవత బూరగలమ్మ దేవాలయంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 24 : మీ ప్రేమ, అభిమానానికి రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం నామినేషన్ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రచార రథం నుంచి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలు నాపై నమ్మకంతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, రానున్న ఎన్నికల్లో ఏన్డీయే కూటమి అధికారంలోకి రానున్నదని ప్రజలు నాకు అండగా ఉండి గెలిపించే విధంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ఐదేళ్ళ జగన్మోహన్‌రెడ్డి పాలనలో సర్వనాశనం అయిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా, పోలవరం నిర్మించలేని దుస్థితి, మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ఒక్క ఇటుక కూడా పెట్టిన దాఖలాలు లేవన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై పన్నుల భారం మోపటంతో ప్రజలు బతికే పరిస్థితి లేదన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ప్రపంచా న్ని తలదన్నే రాజధానిని నిర్మించి యువత ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడితే కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలకు పూనుకుని నాపైనే మూడు కేసులు పెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని పాతాళంలోకి తొక్కేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నార న్నారు. జిల్లాలోనే రేపల్లె నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, రేపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి తన విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకట శివరామకృష్ణ, తాతా ఏడుకొండలు, అనగాని శివప్రసాద్, పూషడపు కుమారస్వామి, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, చింతల సుబ్బారావు, మల్లాది రామకృష్ణ, నిజాంపట్నం జడ్పీటీసీలు నర్రా సుబ్బయ్య, మాన్యం శివ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్‌కు ర్యాలీగా బయల్దేరిన ఎమ్మెల్యే అనగాని సోదరుడు శివప్రసాద్



ర్యాలీలో యువత నృత్య ప్రదర్శన



ఎమ్మెల్యే అనగానికి గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

గ్రామాలాభివృద్ధిని మరిచిన పాలకులకు బుద్ధి చెప్పాలి

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

● కూటమితోనే గ్రామసీమల అభివృద్ధి

బాపట్ల, ఏప్రిల్ 24 : వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పూర్తి స్థాయిలో విస్మరించారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. జరగనున్న ఎన్నికలలో వీరికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం నరసాయపాలెం, కంకటపాలెం, మురుకొండపాడు గ్రామాలలో పార్టీశ్రేణులతో కలిసి నరేంద్రవర్మ విస్తృత ప్రచారం నిర్వహించారు. కూటమితోనే గ్రామసీమల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. గ్రామాలలో తాగునీటి సమస్య, సాగునీటి ఇబ్బందులు, వీధిదీపాల ఇక్కట్లు, అధ్వానపు రహదార్లు వంటి సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. రైతులు పొలాలకు వెళ్ళే లింక్‌రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. శ్మశానవాటికలలో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. కూటమితోనే గ్రామసీమల అభివృద్ధి సాధ్యం కావున ప్రజలంతా మద్దతుగా ఉండి గెలిపించాలన్నారు. కుల, మతాలకు అతీతంగా, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కూటమితో కలిసి సూపర్ సిక్స్ పథకాలతో మీ ముందుకొస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి, అభివృద్ధే నినాదంగా కూటమి పని చేస్తుందన్నారు. ప్రలోభాలకు లొంగకుండా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ నాయకులు కామేపల్లి కృషిబాబు, కళ్ళం హరినాధ్‌రెడ్డి, ముక్కామల సాంబశివరావు, చెన్నుపాటి కిషోర్, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, మాజీ ఎంపీపీ మానం విజేత, దండమూడి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



నరసాయపాలెం గ్రామంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నరేంద్రవర్మ



నరేంద్రవర్మతో కలిసి ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు

ఐదేళ్ల వైసీపీ పాలనలో దోచుకోవడం దాచుకోవడమే

● అధికారం వచ్చిన మూడు నెలల్లో అభివృద్ధిపైనే దృష్టి

● టీడీపీ కూటమి అభ్యర్థి ఆనందబాబు హామీ

కొల్లూరు, ఏప్రిల్ 24 : వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వనరులను దోచుకుని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు విమర్శించారు. బుధవారం సాయంత్రం కొల్లూరు మండలపరిధిలోని ఆరు లంక గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిలుమూరు లంకలో ఆయన ఇంటింటి ప్రచారం ప్రారంభించి బాబు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ టీడీపీ కూటమికి ఓటు వేసి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో అన్ని గ్రామాల్లో ఆయనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. చిలుమూరులంకతో పాటు సుగ్గునలంక, ఈపూరులంక, చింతల్లంక, పెదలంక, పెసర్లంక గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆనందబాబు మాట్లాడుతూ కృష్ణానది పరివాహక ప్రాంతమైన లంక గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యం గా ఇసుక తవ్వకాలు చేసి ప్రకృతి సంపాదనను దోచేశారన్నారు. తద్వారా లంక గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయన్నారు. దేశంలో మద్యం వ్యాపారం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ ఒక్కడేనని, మద్యం అమ్మకాల్లో సింహ భాగం వాటా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతుందని ఆరోపించారు. సామాజిక పించన్ల పంపిణీ చేయడం చేతకాక ఆ నెపం టీడీపీపై నెట్టారని, ఇప్పుడు కొత్తగా గులకరాయి డ్రామాకు జగన్ తెర తీశాడన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన జగన్ అన్నివిధాలా ప్రజలను మోసం చేశారని, మరోసారి ఆ తప్పు చేయవద్దన్నారు. ఆనందబాబు సమక్షంలో సుగ్గునలంక సర్పంచ్ సుగ్గున అంకమ్మరావు టీడీపీలో చేరారు. ప్రచారంలో బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి కృష్ణప్రసాద్ కుమార్తె రమ్య కృష్ణ, వేమూరు నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త ఊసా రాజేష్, టీడీపీ, జనసేన పార్టీల కన్వీనర్లు మైనేని మురళీకృష్ణ, జొన్నలగడ్డ విజయబాబు, బొందలపాటి చలమయ్య, సోమరౌతు అనురాధ, లంక గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



లంక గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న కూటమి అభ్యర్థి ఆనందబాబు



పెసర్లంకలో జనసైనికులతో ఆనందబాబు, రాజేష్ తదితరులు

సూపర్-6 పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 24: మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందు కు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్-6 పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం నగరం మండలం సిరిపూడి, పెద్దపల్లి, గ్రామాల్లో ప్ర చారం నిర్వహించారు. ప్రచారంలో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని ఎమ్మెల్యే అనగానికి స్వాగతం పలికారు. మహిళలు హారతుల నిచ్చారు. అన్న మూడోసారి విజయం నీదే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తెలుగుదేశం పార్టీ కూటమిని ఆశీర్వదించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఒక్క చేత్తో రూ.10లు ఇచ్చి మరొక చేత్తో రూ.100లు లాగేసుకుంటున్న విషయాన్ని అందరూ గమనించాలన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనలో కరెంటు, బస్సు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయి సామాన్యుడిపై అధిక భారం మోపారన్నారు. మద్యనిషేధం గాలికి వదిలేసి సొంతంగా మద్యం వ్యాపారం చేస్తూ నాసిరకం మద్యంతో పేదల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. తీరప్రాంతంలో అభివృద్ధి చేసే విధంగా నావంతు కృషి చేస్తానని మీరంతా నాకు అండగా నిలిచి నాగెలుపునకు కృషి చెయ్యాలని కోరారు. రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లి యాదవపాలెంలో ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్, ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గెలుపునకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఏన్డీయే కూటమిని బలపరిస్తే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ మేకా వెంకట శివరామకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, వుయ్యూరు భీమేష్‌కుమార్, విచారపు కటుంబరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతు న్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

వలంటీర్‌లు అపోహలు నమ్మి మోసపోవద్దు

● ఉద్యోగులుగా గుర్తించి రూ.10 వేలు అందిస్తాం

● మాజీ మంత్రి ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఏప్రిల్ 24: వలంటీర్ వ్యవస్థపై వైసీపీ నాయకు లు బెదిరింపులకు పాల్పడుతూ టీడీపీపై బురదజల్లడాన్ని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ వేమూరు నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి వలంటీర్ల మీద ఒత్తిడి తీసుకువచ్చి రాజీనామా చేసి పార్టీకి ప్రచారం చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తీసివేస్తామని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. వలంటీర్లు ఎవరికి భయపడాల్సిన పని లేదని మీ చదువుకు తగిన గుర్తింపును టీడీపీ ఇస్తుందని భరోసాను ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లకు గౌరవ వేతనం నెలకు రూ.10వేలు ఇస్తామని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. ఎవరో ఏదో చెప్పారని ఒత్తిడికి గురై రాజీనామాలు చేయవద్దని వైసీపీ కరపత్రాలను పట్టుకుని ఇంటింటికి తిరిగి ప్రచారం చేయవద్దని ఎన్నికల నిబంధనలు విరుద్ధంగా ప్రవర్తించి ఇబ్బందులకు గురి కావద్దన్నారు. ఇప్పటికే రాజీనామాలు చేసిన వారు కూడా ఆలోచన చేయాలని రాజీనామాలను వెనక్కి తీసుకోవాలని ఆనందబాబు విజ్ఞప్తి చేశారు. వలంటీర్లను చిన్నపాటి ఉద్యోగులుగా గుర్తిస్తామని మీకేమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని ఆనందబాబు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండింగ్ కారును ప్రారంభించిన ఆనందబాబు

టీడీపీ బ్రాండింగ్ కారును నక్కా ఆనందబాబు బుధవారం ప్రారంభించారు. బాబును మళ్ళీ రప్పిద్దాం నినాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల సింబళ్ళతో ఉన్న కారును ఆయన ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆనందబాబు

వైసీపీని వీడి టీడీపీలో చేరిన కార్యకర్తలు

కొల్లూరు, ఏప్రిల్ 24 : వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. బుధవారం కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో మండలపరిధిలోని ఈపూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరో 20 రో జుల్లో జరగబోయే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణ ప్రసాద్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, మైనేని మురళీకృష్ణ, మేకా దివాకర్, మెడబలిమి వాసు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొల్లూరు, ఏప్రిల్ 24: అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం మండల పరిధిలోని క్రాప అడ్డరోడ్డు వద్ద క్రాప గ్రామానికి చెందిన కొత్తపల్లి మధుసూదనరావు దాతల సహకారంతో అభయాంజనేయస్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించి స్వామి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠింపజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు, ఆయన తనయుడు డాక్టర్ అఖిలేష్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, జొన్నలగడ్డ విజయబాబు, కోగంటి హరిబాబు, స్వామిని దర్శించుకున్నా రు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన అవ్వారు రామారావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

చెరుకుపల్లి, ఏప్రిల్ 24: గత ప్రభుత్వ హయాంలో రేపల్లె నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి టీడీపీలోకి చేరుతున్న రేపల్లె మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్, వైసీపీ నాయకులు చెన్నకేశవ స్వామి ట్రస్టుబోర్డు చైర్మన్ అవ్వారు రామారావు పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో అనగాని సమక్షంలో టీడీపీలోకి చేరారు. రాష్ట్రంలోనే నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చిన అనగాని సత్యప్రసాద్‌కు మద్దతు తెలపటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా వైసీపీకి చెందిన 11వ వార్డు మాజీ వార్డు సభ్యులు అందె సాంబశివరావు కూడా వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారిద్దరికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

భట్టిప్రోలు, ఏప్రిల్ 24: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ను గెలిపించడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి ఆనందబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తనయుడు డాక్టర్ నక్కా అఖిలేష్ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మం డలంలోని పెదలంకలో బుధవారం రాత్రి అఖిలేష్ ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ చైర్మన్ మో టూరు పుణ్యశ్రీనివాసరావు, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు వేములపల్లి జగన్నాధరావు, వేములపల్లి శివకుమార్, వేములపల్లి రత్నగోపాల్, నాగయ్య చౌదరి, కారంకి వీరయ్య, పి. రాఘవరావు, ఎన్ ప్రసాద్, ఎన్ రాము, దుర్గారావు, దినకర్‌బాబు, పి. రమేష్, పాల్గొన్నారు. మండలంలోని పల్లెకోన గ్రామంలో టీడీపీ నాయకులు నక్కా ఆనందబాబును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రాయనప్రసాద్, వేజళ్ళ సతీష్, రావూరి వరప్రసాద్, గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేంరాజు, మండవ రామకోటేశ్వరరావు, దున్నా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో గల మంతెన సత్యనారాయణరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1963-1973 సంవత్సర కాలంలో విద్యనభ్యసించిన 60 మంది పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పద్మారావు అధ్యక్షత వహించారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు బేతాళం అచ్యుత రామరాజు, పొన్నపల్లి రామాంజనేయశాస్త్రి, చెరువు శివరామకృష్ణశాస్త్రి, కోట విజయమోహన్, బేతాళం రామరాజు తదితరులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు అప్పటి గణిత ఉపాధ్యాయుడు దెందుకూరి కృష్ణంరాజుని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు గణితశాస్త్ర ఉపాధ్యాయుడు కృష్ణంరాజు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు కరీం, కేబీకే మూర్తి, యుపీఎల్ఎస్ ఆచార్యులు, బి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



మాచర్ల ర్యాలీలో అసెంబ్లీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి, షరీఫ్ తదితరులు



బ్రహ్మారెడ్డి నామినేషన్‌లో జన సందోహం

మంచి నేతనే.. ఎన్నుకుంటాం

● తొలిసారి ఓటు వేస్తున్న యువత మనోగతం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 24: వారంతో తొలిసారి ఓటు వేయబోయే నవ యువత.. అభివృద్ధిలో తాము భాగస్వాములు కావాలనుకునే లక్ష్యంతో తొలిఅడుగు వేస్తున్నారు. ఎవరికి ఓటు వేయాలి? తమ భవిష్యత్తును ఎవరు తీర్చిదిద్దుతారు అనే అంశాలు దృష్టిలో ఉంచుకుని ఓటు వేస్తామని చెబుతున్నారు. అంతేకాదు రాష్ట్ర భవిష్యత్ ఏమిటి? గతంలో పనిచేసిన, ప్రస్తుత పాలకుల తీరు ఏమిటి తదితర అంశాలు నిశితంగా విశ్లేషిస్తామని చెబుతున్నారు. సంక్షేమ పథకాలతోపాటు ఆర్థిక అభివృద్ధి ముఖ్యమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తొలిసారి ఓటు వేయనున్న కొంతమంది యువత తమ అభిప్రాయాలు ఆంధ్రజ్యోతిలో పంచుకున్నారు. ఆ వివరాలు ఇలా...

నాయకుడికి నిబద్ధత ఉండాలి...



తొలిసారి ఓటుహక్కు వినియోగించుకునే తాము మంచి నాయకుల్ని మంచి నాయకున్ని ఎంచుకుంటాం. మంచి నాయకుడి వల్లే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. అంతేకాదు వ్యవస్థలపై సరైన అవగాహన పెంచుకోవడంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుల్ని ఎన్నుకుంటాం.

- ఏవీ హేమనందిని

ధన, కుల బలానికి అతీతంగా..



ఎన్నికల్లో ప్రధానంగా ధన, కుల బల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. ఇందుకు అతీతంగా ఉన్న నాయకుల్ని ఎంచుకువాలనేది లక్ష్యం. అభివృద్ధి చేసే నాయకుల్ని ఎన్నుకంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. యువత భవిష్యత్తుకు ఆధారమైన పరిశ్రమల, ఉద్యోగ, ఉపాధి కల్పనకు భరోసా ఇచ్చేవారే కావాలి.

- ఎస్‌వీ సాయి

అధికార దర్పం ఉండకూడదు...



నాయకులకు అధికార దర్పం, అవినీతి ఉండకూడదు. అధికారాన్ని సొంత దర్పాలకు, విలాసాలకు వినియోగించకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులనే ఎన్నుకుంటాం. రాజధాని నిర్మాణంతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమౌతుందని విశ్వసిస్తున్నాం. యువత ఓటు విలువను తెలుసుకోవడంతోపాటు దానికి విస్తృత ప్రచారం కల్పించాలి.

- షేక్ సానియా

ఓటు హక్కును బాధ్యతగా తీసుకోవాలి..



ఓటును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత. తన ఓటు ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవడంతోపాటు దీనిని తన గెలుపుగా భావించాలి అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. తన ఓటు తన భవిష్యత్తుగా ఓటరు భావించాలి. ఐటీ పరిశ్రమలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- వి.సూర్యతేజ

ఓటు పైనే మన భవిష్యత్ ఆధారపడి ఉంది..



విజ్ఞానవంతులైన విద్యార్థులు మంచి నాయకున్ని ఎన్నుకుంటేనే సమాజం బాగుంగుంది. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆ దిశగా ఆలోచన చేసే నాయకులను మాత్రమే ఎన్నుకోవాలి.

- ఎన్.హరీష్

సంక్షేమంతోపాటు అభివృద్ధి ముఖ్యం..



ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు అభివృద్ధికి పాటుపడే వారినే ఎన్నుకుంటాం. రాష్ట్రంలో భిన్న రకాల పరిశ్రమల ఏర్పాటుతోనే రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం. డబ్బు ప్రభావానికి గురి కాకుండా ఓటును వినియోగించుకోవాలి.

- డి.అశోక్ వర్ధన్

నేటితో ముగియనున్న నామినేషన్లు

- ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా దాఖలు
- వారం రోజులు కోలాహలంగా సాగిన ప్రక్రియ
- టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల ఘట్టానికి జనాదరణ
- జనం లేక వెలవెలబోయిన వైసీపీ అభ్యర్థుల ర్యాలీలు

బాపట్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో వారం రోజుల నుంచి కొన సాగుతున్న నామి నేషన్ల అంకానికి గురువారం తెరపడనుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైన సంగతి తెలిసిందే. చాలావరకు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పక్షాలు, స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు. రెండు మూడు సెట్లు నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీ అభ్యర్థులు ముందుజాగ్రత్తగా కుటుంబసభ్యులతో కూడా ప్రత్యేకంగా నామినేషన్లు దాఖలు చేయించారు. గురువారం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నామినేషన్ పర్వాన్ని ముగిం చుకున్న అభ్యర్థులంతా ప్రచారంలో దూకుడు పెంచారు. కీలకమైన స్క్రూటినీ ఘట్టం ఈ నెల 26న జరగనుంది. ఆ తర్వాత 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తదుపరి తుది పోరులో ఉండే అభ్యర్థులు, పార్టీలు, గుర్తులపై స్పష్టత రానుంది

టీడీపీలో పెరిగిన ధీమా..

నామినేషన్ల ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి పసుపు సైన్యం జోరు పెంచింది. టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల పర్వం ఆయా నియోజకవర్గాల్లో జనజాతరను తలపించింది. ఎండలు మండిస్తున్నా లెక్కచేయకుండా ఊహించని రీతిలో జనం తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభ్యర్థులకు దిష్టితీసి వీరతిలకాలు దిద్దగా, యువత బైక్ ర్యాలీలు, కేరింతలతో సందడి చేసింది. టీడీపీతో పాటు బీజేపీ, జనసేన శ్రేణులు, నేతలు అభ్యర్థుల వెంట నామినేషన్ల ర్యాలీలో పాల్గొని కూటమి ఐక్యతను చాటారు. మరోవైపు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లకు కనీస స్థాయిలో కూడా జనం కరువ య్యారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే నామినేషన్ల పర్వాన్ని వాయిదా కూడా వేసు కోవాల్సి వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం ఆవరించిందని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు.

జిల్లాలో 147 నామినేషన్లు దాఖలు

ఇప్పటి వరకు జిల్లాకు సంబంధించి 147 నామినేషన్లు దాఖలయ్యాయి. బాపట్ల లోక్‌సభ స్థానానికి 11 మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 88 మంది అభ్యర్థులు 131 సెట్ల నామినేషన్లు వేశారు. బుధవారం లోక్‌సభ స్థానానికి ముగ్గురు, అసెంబ్లీ స్థానాలకు 46 మంది అభ్యర్థులు 55 నామినేషన్లను దాఖలు చేశారు. గురువారం ఒక్క రోజే నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉందని సమాచారం. జిల్లాలో టీడీపీ తరఫున నామినేషన్ వేయాల్సిన వారిలో చీరాల అభ్యర్థి కొండయ్య ఒక్కరే మిగిలి ఉన్నారు. ఆయన గురువారం నామినేషన్ వేయనున్నారు.

నామినేషన్ల కోలాహలం



వినుకొండ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న జీవీ, కన్నా, మక్కెన

భానుడు భగభగమంటున్నా.. నామినేషన్ల ఉత్సవాలు జనజాతరను తలపించాయి. బుధవారం నామినేషన్ల సందర్భంగా కూటమి అభ్యర్థులు చేపట్టిన రోడ్‌షోలతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడాయి. ఎక్కడికక్కడ కూటమిశ్రేణులతో పాటు యువత, మహిళలు భారీగా తరలివచ్చారు. యువత సందడి, నేతల సత్కారాల మధ్య అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. అభ్యర్థుల ర్యాలీల్లో సంప్రదాయ డప్పు వాయిద్య కళాకారులు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- బాపట్ల



రోడ్‌షోలో పాల్గొన్న భారీ జనసందోహం



చింతలపూడి గంజే షాహిద్ బాబా దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న నరేంద్రకుమార్ తదితరులు



రేపల్లెలో నామినేషన్‌కు బయలుదేరే ముందు ఇంటి వద్ద ఎమ్మెల్యే అనగానికి హారతులు ఇస్తున్న డాక్టర్ మంజుల, కమల



నామినేషన్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



పొన్నూరులో నరేంద్రకుమార్ నామినేషన్‌కు తరలివచ్చిన టీడీపీ, జనసేన అభిమానులు



ప్రత్యేక ప్రార్థనల్లో మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలిలో మనోహర్ నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన ఉమ్మడి పార్టీల శ్రేణులు



సుమారు 22 మంది రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోకి వెళ్తున్న దృశ్యం



బస్టాండ్‌లోకి బస్సులు రాకుండా అడ్డుపెట్టిన బారికేడ్లు

వారికో రూల్.. వీరికో రూల్!



ట్రాక్టర్ గుద్దుకోవడంతో అపస్మారక స్థితిలో ఉన్న కే స్వామిబాబు

- వైసీపీకి తొత్తులుగా అధికారులు
- ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు
- మహేష్‌రెడ్డి నామినేషన్లో ఏరులై పారిన మద్యం

గురజాలటౌన్, ఏప్రిల్ 24: గురజాల నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి ఒక రూలు.. వైసీపీ అభ్యర్థికి మరో రూలు విధిస్తున్నారు. ఈనెల 22వ తేదీన సోమవారం గురజాల అసెంబ్లీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. ఆ రోజు పోలీసు అధికారులు అడుగడుగునా రూల్స్ విధిస్తూ హుకుం జారీ చేశారు. టీడీపీ ఆధ్వర్యాన ఒక్క డీజే ఏర్పాటు చేయగా అనుమతి లేదంటూ దానిని కూడా నిలిపివేశారు. ఆర్డీవో కార్యాలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యరపతినేనితోపాటు నలుగురిని మాత్రమే అనుమతించారు. యరపతినేని పీఏ కోటేశ్వరరావు కొన్ని పత్రాలను యరపతినేనికి ఇచ్చేందుకు వచ్చినప్పుడు అక్కడే ఉన్న ఓ సీఐ అడ్డుకున్నారు. కొన్ని పత్రాలు ఇవ్వాలి సార్ అని బతిమాలినా వినలేదు. టీడీపీ వాహనాలు మొత్తం దండివాగు వద్దనే ఆపేశారు. అనుమతి ఉన్న వాహనాలను కూడా అనుమతించలేదు.

వైసీపీ వర్తించవా..

వైసీపీ గురజాల అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి బుధవారం నామినేషన్ చేశారు. వైసీపీ నేతలు భారీగా డీజేలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సుమారు 10 డీజేలతో భారీ ధ్వనులు సృష్టించారు. మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోలేదు. పార్కింగ్ స్థలాన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులను బస్టాండ్ లోపలికి రానివ్వకుండా పోలీసులు బయట నుంచే పంపించారు. ఇదిలా ఉండగా నామినేషన్ వేసేందుకు వచ్చిన కాసు మహేష్‌రెడ్డితోపాటు సుమారు 30 మంది బారికేడ్లు దాటి వచ్చారు. అయితే 22వ తేదీన విధులు నిర్వహించిన సీఐనే బుధవారం కూడా విధులు నిర్వహించారు. కాగా అక్కడే కేంద్ర బలగాలతోపాటు డీఎస్పీ స్థాయి అధికారులు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరావు ఉండడం గమనార్హం. దీనిపై ఆర్డీవో కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా.. మహేష్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు స్వతంత్ర్య అభ్యర్థులు నామినే షన్ వేసేందు కు వచ్చారని చెప్పారు.

పక్షపాత ధోరణి..

ప్రత్తిపాడు, ఏప్రిల్ 24: ఎన్నికల సమయంలో అధికారులు పూర్తిగా పక్షపాత ధోరణిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల పట్ల ఒక తీరుగా.. వైసీపీ నాయకుల పట్ల ఒక తీరుగా పోలీసులు వ్యవహరిస్తున్న వైనం ఇప్పుడు ప్రత్తిపాడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బూర్ల రామాంజనేయులు నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రచార వాహనాన్ని అక్కడే ఆపించి, అభ్యర్థితో పాటు ఐదుగురికి అక్కడి నుండే లోపలకు అనుమతించారు. కాని వైసీపీ అభ్యర్థి విషయంలో తహసీల్దార్ కార్యాలయం వరకు అభ్యర్థి ప్రచారవాహనాన్ని అనుమతించారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆగిన వైసీపీ వాహనాలను పక్కకు పంపించే ప్రయత్నం కూడా చేయలేదు. ప్రత్తిపాడులో వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ నామినేషన్ పూటుగా మద్యం తాగిన యువత ఇష్టానుసారంగా వాహనాలను నడపటం ఎదుటి వ్యక్తుల ప్రాణాలమీదకు తెచ్చింది. ఈ ర్యాలీకి ట్రాక్టర్లను సైతం తెచ్చి వాటితో విన్యాసాలు చేయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలేనికి చెందిన కొండేపాటి స్వామిబాబు కాలుపై ట్రాక్టర్ ఎక్కింది. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. చివరికి చిన్నారులను సైతం ఇందులో భాగస్వాములను చేశారు. ఆర్వో కార్యాలయం వద్ద అభ్యర్థి ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు. కాని బలసాని కిరణ్‌కుమార్ ఆర్వో కార్యాలయం చుట్టూ తిరిగి ప్రజలకు అభివాదం చేశారు.

టీడీపీ సానుభూతి పరుల వాహనాలపై దాడి

వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో వైసీపీ మూక బరితెగించారు. ప్రధాన రహదారిలో ప్రయాణిస్తున్న తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల వాహనాలపై ఎగబడ్డారు. కారులో నుంచి తెలుగుదేశం పార్టీ కండువా కనిపిస్తుండంతో రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు కారుపై ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎలాగోలా అక్కడి తప్పించుకుని వెళ్లిపోయారు.



ఒక చేత్తో క్వార్టర్, వాటర్ బాటిల్.. మరో చేత్తో వైసీపీ జెండాతో ర్యాలీలో ఇలా...



టీడీపీ సానుభూతిపరుల వాహనంపై దాడి చేస్తున్న వైసీపీ మూక



ఆర్వో కార్యాలయం వరకు వచ్చిన వైసీపీ అభ్యర్థి ప్రచార వాహనం

7వ రోజు తొమ్మిది నామినేషన్లు

చీరాల, ఏప్రిల్ 24 : ఎన్నికల వేళ నామినేషన్లు వేసే వారి సంఖ్య పెరుగుతోంది. 7వ రోజు బుధవారం వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలపి 7 నామినేషన్లు దాఖలైనట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. కరణం వెంకటేష్ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), మద్దులూరి మాలకొండయ్య (తెలుగుదేశం పార్టీ), బాలకొండమ్మ మద్దులూరి (తెలుగుదేశం పార్టీ, సబ్స్టిట్యూట్), షేక్ అబ్దుల్ బషీర్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్), దేవరపల్లి రంగారావు (స్వతంత్ర అభ్యర్థి) ఆసాది ఆంజనేయులు (స్వతంత్ర అభ్యర్థి) వారివారి నామినేషన్ పత్రాలు స్వయంగా అందజేశారు. ఆమంచి సుజాత (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సబ్స్టిట్యూట్) తరపున ఆమె ప్రతినిధులు నామినేషన్ పత్రాలను అందజేశారు.

కొండయ్య ఆస్తి రూ.19.48కోట్లు

చీరాల, ఏప్రిల్ 24 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య బుధవారం ఓ సెట్ నామినేషన్ పత్రాలను ఈఆర్వో సూర్యనారయణరెడ్డికి అందజేశారు. నామినేషన్ పత్రాలలో పొందుపరిచిన అఫిడవిట్‌లో కొండయ్య (మద్దులూరి మాలకొండయ్య) ఆస్తుల విలువ రూ.19,48,16,505గా పేర్కొన్నారు. అందులో కొండయ్య పేరున రూ.11,82,81,880, ఆయన భార్య బాలకొండమ్మ పేరున రూ.7,65,35,625 ఆస్తులు ఉన్నట్లు చూపారు. కొండయ్య పేరున రూ.1,46,05,579, భార్య పేరున రూ.2,26,11,680 అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇరువురి వద్ద నగదు రూ.5,15,200 ఉన్నట్లు చూపారు. నేరచరిత్ర లేదని పేర్కొన్నారు.

అసెంబ్లీ అభ్యర్థులుగా 12 మంది నామినేషన్‌లు

పర్చూరు, ఏప్రిల్ 24 : పర్చూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులుగా బుధవారం 12 మంది నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఆర్వో రవీందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు తరుపున నామినేషన్ దాఖలైంది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అలోకం రమష్‌బాబు, రాడికల్ పార్టీ ఆప్ ఇండియా అభ్యర్థిగా యరిజర్ల ఉద్యుత్ కుమార్, మూడు నామినేషన్‌లను దాఖలు చేశారు. అదేవిధంగా చిమట హనుమంతురావు (ఇండిపెండెంట్), గాలి చింపిరయ్య (ఇండిపెండెంట్), దీపక్ గోపాళం, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, యడం బాలాజీ యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, , శానం సురేష్, జైభీంరావ్ భారత్ పార్టీ తరుపున నామినేషన్‌లను ఆర్వో గంధం రవీందర్‌కు అందజేశారు.

వైసీపీ పాలనలో సంక్షోభంలో వ్యవసాయం

- అన్నదాతల సంక్షేమమే కూటమి లక్ష్యం
- చంద్రన్న హయాంలో స్వర్ణయుగం
- రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీలోకి రండి
- ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి పిలుపు
- పావులూరు, వింజనంపాడులో వైసీపీ వీడి టీడీపీలోకి చేరికలు


ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన పావులూరు ఎస్సీలు

పర్చూరు, ఏప్రిల్ 24 : అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైసీపీ పాలనలో సంక్షోభానికి గురైందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పావులూరు, వింజనంపాడు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా జగన్ వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసారని ఏలూరి మండిపడ్డారు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. అన్ని వ్యవస్థలతోపాటు, వ్యవసాయ రంగాన్ని జగన్ ధ్వంసం చేశారన్నారు. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

టీడీపీ హయాంలోనే రైతులకు స్వర్ణయుగం

చంద్రబాబు పాలనలోనే రైతులకు స్వర్ణయుగంగా ఉందని, వైసీపీ ప్రభుత్వంలో అన్నదాలలు అప్పులయ్యారన్నారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, మద్యం, మైన్స్, ల్యాండ్ మాఫియా కొనసాగుతుందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన ఆవస్యకత ఉందన్నారు.

వైసీపీకి గుడ్‌బై చెప్పిన పావులూరు, వింజనంపాడు

మార్టూరు : మే 13న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఇంకొల్లు మండలం పావులూరు, యద్దనపూడి మండలం వింజనం పాడు గ్రామాలకు చెందిన వైసీపీ మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఏలూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌రెడ్డి విధ్వంస పాలనపై విసుగు చెంది, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం వైసీపీకి గుడ్‌బై చెప్తున్నారన్నారు. చేరుతున్న వారికి టీడీపీ తప్పనిసరిగా గౌరవం ఇస్తుందన్నారు. ఒక్కచాన్స్‌తో వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌రెడ్డికి మరోచాన్స్ లేకుండా ఓటుతో పంపాలన్నారు. పార్టీలో చేరిన పావులూరు ఎస్సీ కాలనీకి చెందిన వలేరు ఏసోబు, పాగాల వీరయ్య, వలేరు నాగరత్తయ్య, ఎండ్లూరి ఆదాం, బత్తుల కోటేశ్వరరావు, వల్లపాటి సుబ్బారావు, రావూరి రామయ్య, తెళ్ల బుజ్జి, తెళ్ల ఆదియ్య, పాగల రాంబాబు, బత్తుల ఏసుబాబు, జొన్నలగడ్డ మహిమ కుమార్, సిరిమెల వివేక్, కట్టెంపూడి నాగార్జున, వలేరు చిరుతేజ, పాగాల పూర్ణ, ఎండ్లూరి గాంధీ, సోమ ఇజ్రాయేల్, చుండూరి మరియబాబు, వలేరు చిన్న బ్బాయి, సిరిమల కల్యాణ్ తదితరులు ఉన్నారు. అదే విధంగా వింజనంపాడు గ్రామం నుంచి కె.నాగేశ్వరావు, గంగవరపు సురేష్, మేక అంకమ్మ కోరేల లూథర్ తదితరులు పార్టీలో చేరారు. అనంతరం ద్రోణాదుల గ్రామానికి చెందిన తాళ్లూరి రామయ్య పార్టీలో చేరారు. కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరావు, రావిపాటి సీతయ్య, గుదే తారక రామారావు, కొర్రపాటి కాజారావు పాల్గొన్నారు.


యనమదల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఏలూరి

కూటమి ప్రభుత్వాన్ని గెలిపించండి

యద్దనపూడి, (మార్టూరు) : టీడీపీ కూటమి ప్ర భుత్వాన్ని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం యద్దనపూడి మండల పార్టీ నాయకులతో కలిసి మండలంలోని యనమదల, అనంతవరం, సూరవరపుపల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ మూడు గ్రామాలలో ఏలూరి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించిన ఆయన మహిళలు, వృద్ధులతో మాట్లాడారు. వైసీపీ అరాచకాలు, దోపిడీ, అవినీతిని వివరించారు. గ్రామాల్లో సహజ సంపదైన గ్రావెల్, చెరువు మట్టిని వైసీపీ నాయకులు దోచుకొని లక్షలు పోగేసుకున్నారన్నారు. యద్దనపూడి మండలంలో రోడ్లను పట్టించుకున్న వారే లేరన్నారు. ధరల నియంత్రణ, పన్నుల భారం తగ్గాలంటే చంద్ర బాబు ప్రభుత్వం అధికారంలోకి రావలసిందేన న్నారు. మహిళలను ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేలా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. జగన్‌రెడ్డి అసమర్థ పాలనన చూసిన మీరంతా రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపాలని ఏలూరి కోరారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎం పీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల ప్రజలు, మహిళలు ఏలూరికి ఎదురెళ్లి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, బోయపాటి సాంబయ్య, రావి పాటి సీతయ్య, గుదే తారక రామారావు, వంశీ, కోయ సతీష్ పాల్గొన్నారు.


జ్ఞాపికలు అందజేస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

అవకాశాలతో ఉన్నతంగా ఎదగాలి

చీరాల, ఏప్రిల్ 24 : తమ కళాశాల నుంచి చదువు పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకుని, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. కళాశాలలో సీఎస్ఈ ఆఖరి సంవత్సరం పూర్తిచేసుకున్న విద్యార్థులకు బుధవారం కళాశాలలో వీడ్కోలు సభ నిర్వహించారు. పలువురుకి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి.హరిణి, అక్రిడిటేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.సుబ్బారావు, అడ్మిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి రమణ మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాలకు వచ్చిన ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్

చీరాల, ఏప్రిల్ 24 : బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రేపల్లె, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ ఖాజాసింగ్ బుధవారం చీరాలకు వచ్చారు. ఆయన మండలం వాడరేవులో ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఏజెంట్లు, ప్రజలు తమకు సంబంధించి అభ్యర్థనలను ఆయన దృష్టికి తీసుకెళ్లవచ్చని అవసరమైన వారు 8985382855 ఫోన్‌లో సంప్రదించాలని ఆయన ప్రతినిధులు సూచించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు అందుబాటులో ఉంటారని ఆయన ప్రతినిధులు తెలిపారు.

కూటమితోనే సుపరిపాలన

చినగంజాం, ఏప్రిల్ 24 : టీడీపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుతోనే సుపరిపాలన అందుతుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో కూటమి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంపీ అభ్యర్థి టీ కృష్ణ ప్రసాద్‌లను సైకిల్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం టీడీపీ కూటమి నాయకలు విస్తృతంగా ప్రచారం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనం తరం అంబేద్కర్ నగర్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో ప్రజలెవరూ సంతోషంగా లేరన్నారు. ఐదేళ్లుగా అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులతో అన్నివర్గాలు భయాం దోళనకు గుర య్యారన్నారు. అందరూ ప్రశాంతంగా ఉండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, అజాద్, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, పి.పార్థసారిధి, గంటా చెన్నయ్య, టి.దుర్గారావు, సీహెచ్.రవణమ్మ, సందు శ్రీనివాసరావు, సతీష్, నరహరి గోపి, షేక్ నబీషా, షేక్ జిలాని, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చీరాలటౌన్, ఏప్రిల్ 24 : విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని తద్వారా ఉన్నతంగా రాణిస్తారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సెయింట్‌మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో గ్రూప్-2 అభ్యర్థులకు మెయిన్స్ ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ ముందుగా అందరూ సిలబస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. చీరాల, చుట్టు పక్కల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కష్టపడి చదవడం కంటే ఇష్టపడి అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో డా.ఐ.బాబూరావు, డా.శ్యామసుందర్ రాజు, కళాశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, జయశీలరావు, పుష్పరాజ్, భగవాన్‌దాస్, ఎం.బాబురావు, హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా ఎన్నికలకు సహకరించాలి

పంగులూరు, ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ తిరుపతిరావు కోరారు. ఈ సందర్భంగా పంగులూరు, బూదవాడ, కల్లంవారిపాలెం, మల్లవరం గ్రామాలలో ఎస్ఐ తిరుపతిరావు, కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కోరారు.

అనుమతులు వచ్చేవరకు గుడి నిర్మాణం వద్దు

- దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి
- పనులకు సహకరించాలని గంగవరం గ్రామస్థుల వినతి

గంగవరం (ఇంకొల్లు), ఏప్రిల్ 24 : మండలంలోని గంగవరం కోందరామ స్వామి దేవాలయం ఆవరణను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల అనంతరం చట్టప్రకారం దేవదాయ శాఖ అనుమతులు పొంది ఆలయ నిర్మాణానికి శాఖాపరంగా తమ వంతు కృషి చేస్తామన్నారు.అనుమతులు లేకుండా ఎటువంటి ఆలయ పనులు చేయవద్దని హెచ్చరించారు. ఈ దేవాలయం కూల్చివేత, అభివృద్ధి పనులు చేసే విషయంలో అనుమతులు లేకుండా గ్రామస్థులు పనులు చేపట్టడంపై ఇంకొల్లు గ్రూప్ దేవాలయాల కార్య నిర్వహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావును రెండురోజుల కిందట సస్పెండ్ చేస్తూ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు పంపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి ఆలయ ప్రాంతాన్ని పరిశీలించారు. కానీ గ్రామ స్థులు ఆలయ నిర్మాణ పనులు జరిగేలా అధికారులు సహకరించాలని విన్నవించారు.

తాగునీటి చెరువుల పరిశీలన

నిండేవరకూ నీరివ్వాలని అధికారులకు సర్పంచ్‌ల విజ్ఞప్తి

ఇంకొల్లు, ఏప్రిల్ 24 : ఇంకొల్లు మండలంలోని భీమవరం, కొణికి గ్రామాల్లోని తాగునీటి చెరువులను ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం కోటపాడు మేజరులో పావులూరు మైనరుకు నీటిని విడుదల చేసామని నీరు వృథా కాకుండా చెరువులను సాధ్యమైన మేరకు నింపాలని సూచించారు. తాగునీటి కోసం గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. తాగనీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలంటే వారం రోజులపాటు నీటిని విడుదల చేస్తే కానీ పూర్తి స్థాయిలో చెరువులు నిండుతాయని సర్పంచ్‌లు అధికారులకు విన్నవించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నెస్పీ డీఈ స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విద్యాసాగర్, ఏఈ జ్యోతి, ఎన్నెస్పీ ఏఈ బాలకృష్ణనాయక్, ఎంపీడీవో శ్రీదేవి, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, డీపీవో రవికుమార్, భీమవరం, కొణికి సర్పంచ్‌లు స్వామి, ఆదియ్య పాల్గొన్నారు.


చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

రైతులను దగా చేసిన జగన్‌రెడ్డి

ఓటుతో గద్దె దింపండి : ఇంటింటి ప్రచారంలో కమల్‌కిషోర్


ప్రచారం నిర్వహిస్తున్నబాబీ

బల్లికురవ, ఏప్రిల్ 24 : రైతులను దగా చేసిన జగన్‌రెడ్డిని గద్దె దింపాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. బుధవారం అద్దంకి నియెజకవర్గ టీడీ పీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా కమల్‌కిషోర్ మం డలంలోని వెలమవారిపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశ పెట్టిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించి ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి కూటమి ఎమ్మెల్యే. ఎంపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మీ ఓటే రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేదన్నారు. అక్కడున్న రైతులనుద్దేశించి బాబీ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రైతులకు జరిగిన మేలును గుర్తు చేశారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, సోలార్ మోటార్లు, డ్రిప్‌లు, ట్రాక్టర్లను అందించారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పరికరాన్ని ఇవ్వలేదన్నారు. పంటకు గిట్టుబాటు ధర రాక, పోయిన పంటలకు పరిహారం రాక పలు చోట్ల రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బాబీ ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం మృతిచెందిన రైతు కుటుంబాలను జగన్‌రెడ్డి పరామర్శించి, వారిని ఆదుకున్నపాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఆర్బీకే కేంద్రాలు రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వలేకపోయాయన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క రైతు భరోసా కేంద్రంలో కనీసం ఎరువులు, విత్తనాలను కూడా ఉంచలేదన్నారు. అన్నివర్గాల ప్రజలు ఆలోచించి అభివృద్ధిని కాంక్షించే కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకాలని బాబీ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గ్రామ నేతలు మామిళ్లపల్లి ప్రవిణ్‌కుమార్, వేముల వెంకటేశ్వరరావు, నరసింహారావు, యర్రపు వెంకటేవ్వరరావు, వేముల సత్యనారాయణ, టి.సాయిబాబు, శ్రీనివాసరావు, మీసాల దానారావు, గద్దల కోటేశ్వరరావు, యోహోన్, శంకరయ్య, సుబ్బారావు, పాపారావు పాల్గొన్నారు.

తాగునీటి పరిష్కారమే గొట్టిపాటి ధ్యేయం

ఇంటింటి ప్రచారంలో తనయుడు హర్షవర్ధన్


2వ వార్డులో హర్షవర్ధన్ ప్రచారం

అద్దంకి, ఏప్రిల్ 24 : అద్దంకి పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చేయడమే ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్యేయమని ఆయన తనయుడు హర్షవర్ధన్ అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌ను గెలిపించాలని బుధవారం 2వ వార్డు కాకానిపాలెం, గరటయ్య కాలనీ తదితర ప్రాంతాలలో హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వి వరించారు. మళ్లీ రవికుమార్‌ని ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేపట్టే అభివృద్ధి పనులను తెలి పారు. అన్ని ధరలూ పెంచింది చాలక, చివరకు చెత్త పన్ను వేసిన చెత్త ప్రభుత్వం వైసీపీ అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పట్టణ ప్రజలకు పాత పన్ను విధానం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, బొడ్డపాటి రవిబాబు, ఆదిత్య, మన్నం త్రిమూర్తులు, కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, జనసేన నేత గోరంట్ల సాయి పాల్గొన్నారు.

పన్ను బాదుడు వైసీపీని తరిమేయండి

గొట్టిపాటి ఝాన్సీ పిలుపు


రేణంగివరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 24 : ఎడాపెడా పన్నులతో ప్రజలను బాదిన వైసీపీని ఓటుతో తరిమివేయాలని గొట్టిపాటి రవికుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రేణంగివరం గ్రామంలో బుధవారం ఝాన్సీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి అన్నివర్గాలను మహిళలను, వృద్ధులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. కార్యక్రమంలో నేతలు బొర్రెడ్డి ఓబుల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నా, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, ఆదిరెడ్డి, నాగిరెడ్డి, గుర్రం ఆదిశేఖర్, శ్రీనివాసరెడ్డి, చింతల విజయలక్ష్మి, గొట్టిపాటి వెంకటరత్నం, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీరుస్తా

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి


మేదరమెట్లలో కరపత్రాలు అందజేస్తున్న గొట్టిపాటి

మేదరమెట్ల, ఏప్రిల్ 24 : మేదరమెట్లలో ప్రజల తాగునీటి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. బుధవారం మేదరమెట్లలో ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టోలోని వివరాలు చంద్రబాబు ముఖ్యమంత్రి అమలు చేసే పథకాలను వివరించారు. 25 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేసిన నాయకుడిని వదులుకున్నామన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారన్నారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలకు పొదుపు నేర్పించిన నేత చంద్రబాబు అన్నారు. అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి ఐదు రూపాయలకే పేదల ఆకలి తీర్చిన మహానేత చంద్రబాబు అన్నారు. రూ.16వేల కోట్ల రుణ మాఫీ చేసి విపత్తుల సమయంలో రైతులకు అండగా ఉన్నారన్నారు. టిడ్కో ఇళ్లు, కట్టించి పేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చడానికి ఆయన చేసిన ప్రయత్నాన్ని జగన్‌రెడ్డి తుంగలోకి తొక్కారన్నారు. పరిశ్రమలు తెచ్చి 6 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నిరుద్యోగ యువతకు భృతి ఇచ్చింది టీడీపీ అన్నారు. అధికారంలోకి రాగానే సైకో పాలన ఎలా ఉండబోతుందో రూ.14 కోట్ల విలువైన ప్రజల ఆస్తిని ధ్వంసం ద్వారా జగన్ చూపించారన్నారు. కూల్చడం తప్ప నిర్మించడం చేతకాని జగన్ ఏపీ అభివృద్ధిని ఆర్థిక పరిస్థితిని, ప్రజాస్వామ్య వ్యవస్థలను యువత భవిష్యత్‌ను నాశనం చేశారన్నారు. ఎస్సీలకు 26 పథకాలను రద్దుచేయడంతో పాటు సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి రెండేళ్లు అవుతున్నా.. నేటికీ ఏర్పాటు చేయలేని అసమర్థులు వైసీపీ పాలకులన్నారు. దీంతో అటు రై తులకు, జాలర్లు జీవనోపాధి లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుండ్లకమ్మలో ఇసుకను దోచేసేందుకే గేట్లు బిగించలేదని ఆయకట్టుదారులందరూ ఆరోపిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమం అభివృద్ధి చేసి చూపుతామన్నారు. మే 13న పోలింగ్ రోజు ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాల చేరిక

మండలంలోని తిమ్మనపాలెం ఎస్టీ కాలనీకి చెందిన 12 కుటుంబాల వారు అద్దంకి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం తిమ్మనపాలెం ఎస్టీ కాలనీకి చెందిన అన్నంగి అంజయ్య, పసుమర్తి రవి, అనపర్తి మరియదాసు, తాటిపర్తి రాంబాబు, పసుమర్తి మస్తాన్, తాటిపర్తి యహోషువా, పాలపర్తి జాన్, అన్నంగి ప్రేమ్‌కుమార్, మహేష్, చంటి, యోహాను తదితరులు వైసీపీని వీడి చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు సంఘీభావం ప్రకటించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.., వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపుఖాయమన్నారు. వైసీపీ పట్ల రోజురోజుకు ప్రజల్లో నమ్మకం పోతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రయం వారి వెంట గ్రామ టీడీపీ నాయకులున్నారు.

వైసీపీని వీడిన రామాంజనేయపురం వాసులు

బల్లికురవ, ఏప్రిల్ 24 : మండలంలోని రామాంజనేయపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి బుధవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో సైకిలెక్కారు. పార్టీలో చేరిన కుంచాల వెంకట్రావు, దాసు, శ్రీనివాసరావు, రవి, అంకమ్మ, ఉప్పుతల సత్తయ్య గుంజి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు మరి కొందరిని రవికుమార్ పార్టీలోకి ఆహ్వానించి రానున్న ఎన్నికలలో టీడీపీ విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు.


టీడీపీలో చేరిన వారితో గొట్టిపాటి

టీడీపీలోకి జోరుగా వలసలు

- ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య సమక్షంలో చేరిన వైసీపీ శ్రేణులు


కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన వాడరేవువాసులు

చీరాల, ఏప్రిల్ 24 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొండయ్య చీరాల నియోజకవర్గంలో అడుగుపెట్టినప్పటి నుంచి తనదైన శైలిలో పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆ క్రమంలో శ్రేణులను సమన్వయపరచుకుంటూ వస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన తరువాత మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడంలో ఆయన చేసిన సూచనలు పూర్తి స్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీలో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. ఆ క్రమంలో బుధవారం చీరాల మండలం గవినివారిపాలెంకు చెందిన పలువురు పార్టీ కార్యాలయంలో కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరి, తమ మద్దతు ప్రకటించారు. అలానే మండలంలోని వాడరేవుకు చెందిన పలువురు కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారి మెడలో కొండయ్య టీడీపీ పార్టీ కండువాలువేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరినవారు కూటమి అభ్యర్థి కొండయ్య గెలుపు పూర్తిస్థాయిలో పనిచేస్తామన్నారు. తమ ఓట్లతో పాటు గణనీయంగా ఇతరులను కూడా ప్రభావితంచేసి పెద్దసంఖ్యలో మెజార్టీ వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య నామినేషన్

కార్యక్రమంలో పాల్గోనున్న ప్రముఖ సినీ హీరో నిఖిల్

చీరాల, ఏప్రిల్ 24 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య గురువారం నిర్ణయించిన ముహూర్తంకు నామినేషన్ దాఖ లు చేయనున్నట్లు టీడీపీ కార్యాలయ ప్రతినిధులు బుధవారం తెలిపారు. నామినేషన్ ర్యాలీలో ప్రముఖ సినీ హీరో నిఖిల్ పాల్గొంటారని వారు తెలిపారు. ఉదయం 9 గంటలకు హస్తినాపురంలోని వినాయకుని గుడి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఈఆర్వో సూర్యనారాయణరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నా యకులు, కార్యకర్తలు, నందమూరి అభిమాను లు, పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ అభిమానులు, ప్ర ముఖ హీరో నిఖిల్ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.